# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 187
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
ఏప్రిల్ 23, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## సమస్యలుంటే చెప్పండి



2లో..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందితో ఆత్మీయ సమావేశం

# బయటకు రావొద్దు..

## మండుతున్న ఎండలు



- సాధారణంకంటే 3-4 డిగ్రీల అధికం
- మధ్యాహ్నం బయట తిరగలేని పరిస్థితి
- అప్రమత్తమైన అధికారులు
- వడగాలులపై ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం

సూర్యుడు సుర్రుమంటుండు. ఏప్రిల్ చివరిలోనే తన విశ్వరూపం చూపుతున్నాడు. ఉదయం 9గంటలకే భానుడి భగభగలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. సాధారణంకంటే 3–4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలు ప్రాంతాల్లో 42 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గడంతో జనం ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఈ యేడు అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాలుల ప్రభావం కూడా ఎక్కువగానే ఉంది. దీంతో జనంతో ఎప్పుడు రద్దీగా ఉండే ప్రాంతాలన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. వడగాలులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా పాలనాధికారులు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు బయటకు రావొద్దంటూ సూచిస్తున్నారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..



2లో..

## జిల్లాకు మంచి పేరు తేవాలి


- చదువుతో పాటు సేవాభావం కలిగి ఉండాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



8లో..


## కాంగ్రెస్ అరాచకాలను ఎండగడతాం..

- బీజేపీ తెలంగాణకు అన్యాయం చేస్తోంది
- కేసీఆర్ ప్రసంగం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# బయటకు రావొద్దు..

- మండుతున్న ఎండలు
- సాధారణంకంటే 3-4 డిగ్రీల అధికం
- మధ్యాహ్నం బయట తిరగలేని పరిస్థితి
- అప్రమత్తమైన అధికారులు
- వడగాలులపై ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. నిరుడుతో పోలిస్తే రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు రికార్డ్ అవుతున్నాయి. గతేడాది కంటే 2 నుంచి 3 డిగ్రీలు ఎక్కువ టెంపరేచర్లు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 44 డిగ్రీల మార్క్ దాటాయి. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో వడగాడ్పులు తీవ్రంగా ఉండే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాడ్పుల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆయా జిల్లాల పాలనాధికారులు ఉన్నత స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించి వేసవిలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

## పలు జిల్లాలకు రెడ్ అలర్ట్..

బుధవారం నాలుగు జిల్లాలకు.. గురు, శుక్ర వారాల్లో ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా.. జగిత్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగాం, ములుగు, భూపాలపల్లి, మహబూబూబాద్ తోపాటు ఇతర జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ గురువారం, శుక్రవారాలకు ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయగా.. మిగతా అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్క్ దాటే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించింది.

## 42 డిగ్రీలు దాటిన టెంపరేచర్..

రాష్ట్రంలోని ఒక్క నాగర్ కర్నూల్ జిల్లాలో మాత్రం బుధవారం అత్యల్పంగా 40.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 42 డిగ్రీలు దాటాయి. అదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో అత్యధికంగా 44 డిగ్రీల మార్క్ దాటింది. జగిత్యాల, జోగుళాంబ గద్వాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 43.8 డిగ్రీలు, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో 43.7, కామారెడ్డి, రాజన్నసిరిసిల్లలో 43.6, కరీంనగర్ లో 43.5, పెద్దపల్లి జిల్లాలో 43.4 డిగ్రీల మేర టెంపరేచర్లు నమోదయ్యాయి. మిగతా అన్ని జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటాయి.



## మరో మూడు రోజులు..

మరో మూడు రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్క్ దాటే ప్రమాదం ఉందంటూ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం ఉన్నందున వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని, వారు బయటకు రాకపోవడమే ఉత్తమమంటున్నారు. అత్యవసర పనులుంటే తప్ప బయటకు రావొద్దని చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఆ టైంలో బయటకు వస్తే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నీటి కంటెంట్ ఎక్కువగా ఉండే పుచ్చకాయ, కీర, కర్భూజ వంటి పండ్లు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. డీహైడ్రేట్ కాకుండా నిమ్మరసాలు, కొబ్బరి బోండాలు, ఎలక్ట్రోలైట్స్ ద్రావణాలు తీసుకోవాలని చెబుతున్నారు.

## ప్రభుత్వం అప్రమత్తం..

రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్పమత్తమైంది. వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాలనాధికారులు జిల్లాలోని ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అత్యవసర పరిస్థితిలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇప్పటినుంచి జూలై వరకు ఆశా కార్యకర్తల నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వడగాలులతో వచ్చే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమ్మర్‌కు సంబంధించి జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడంతోపాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో ముఖ్యమైన పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చల్లని తాగునీరు, చాలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సాంస్కృతిక సారధి కళాకారులతో ప్రచారం చేయాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఆర్టీసీ బస్ స్టాండ్ లలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని, పశువులు సంచరించే ముఖ్య కూడలిలో నీటి కుండీలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సమస్యలుంటే చెప్పండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందితో ఆత్మీమ సమావేశం

**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి శాఖపరమైన, వ్యక్తిగత సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సిబ్బందికి సూచించారు. అర్మడ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందితో వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్మడ్ రిజర్వ్ పోలీసులతో పాటు హోంగార్డులు పాల్గొన్న ఈ సమావేశంలో సీపీ శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సిబ్బంది సమస్యల పరిష్కరం కోసం తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్ధేశం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ విభాగంలో ఆర్మడ్ రిజర్వ్ సిబ్బంది చాలా కీలకమన్నారు. వ్యక్తిగత శ్రద్ధతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. మీకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. మీకు ఏదైనా సమస్య ఉంటే ముందుగా మీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని, వీలైనంత వరకు సదరు అధికారులే సమస్యను పరిష్కరిస్తారన్నారు. అదే విధంగా మీ సమస్యలు పరిష్కరించేందుకు సిబ్బందికి అందుబాటులో ఉంటానని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, ఏఎస్పీ మనన్ భట్, ఏసీపీలు జితేందర్ రెడ్డి, నాగయ్య, అనంతయ్య, సురేంద్రతో పాటు ఆర్ఐ పాల్గొన్నారు.





# జిల్లాకు మంచి పేరు తేవాలి

**వరంగల్ వాయిస్, ములుగు :** ఉన్నత చదువులు చదవడం గొప్పకాదని, చదువుతోపాటు సేవాభావం కలిగి ఉన్నప్పుడే గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపిన విద్యార్థుల సన్మాన కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులు మొదటి స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. ఎంత నేర్చుకున్నాం అనేది ముఖ్యం కాదని, పోటీ పరీక్షల్లో నెగ్గడానికి జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదివిన వారు మారుమూల గ్రామాల్లోని ప్రజలకు సేవలు అందించడానికి ముందుకు రావాలని, తాను సైతం భీకరమైన కరోనా సమయంలో ఏజెన్సీ గ్రామాలలో పలు కార్యక్రమాలు నిర్వహించడంతోనే తనకు గుర్తింపు లభించిందని వివరించారు. పిల్లలను, పెద్దలను గౌరవించడం నేర్చుకోవడంతో పాటు సమాజ సేవ బాధ్యతలను నేర్చుకోవాలన్నారు. హాయ్ అనే పలకరింపు పదం మన సంస్కారం కాదని, నమస్కారం అని తెలిపాలన్నారు. ములుగు జిల్లా విద్యార్థులలో పాటు తాను బాధ్యత వహిస్తున్న అసిఫాబాద్ జిల్లా విద్యార్థులు రెండో స్థానంలో ఉండడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి రాష్ట్రంలో, దేశంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేయడంతో పాటు సన్మాన కార్యక్రమాన్ని, పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా అవార్డులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరు క్రమ శిక్షణతో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి చంద్రకళ, లెక్చరర్లు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర మూకలను వదిలి పెట్టే ప్రసక్తే లేదు

**➲ మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శాంతియుత వాతావరణం నెలకొన్న జమ్ము కాశ్మీర్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు, బీజేపీ బీసీ మోర్చా జాతీయ నాయకులు వన్నాల శ్రీరాములు తీవ్రంగా ఖండించారు. ట్రెక్కింగ్ వెళ్లిన టూరిస్టులను టార్గెట్ చేస్తూ ఆర్మీ దుస్తులు ధరించిన ముగ్గురు ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 27 మంది చనిపోవడం, అనేక మంది క్షతగాత్రులు కావడం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని వన్నాల ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జమ్ము కాశ్మీరీలో 370 ఆర్టికల్ ఎత్తి వేసిన తర్వాత ఏర్పడిన టీఆర్ఎఫ్ తామే ఈ ఘాతుకానికి పాల్పడిందనట్లు ప్రకటించడం గమనార్హం. బైసరిన్ వ్యాలిని చూసేందుకు పహల్గాం వచ్చిన సందర్శకులను టార్గెట్ చేసుకుని ఉగ్రవాదులు దాడులు చేయడం క్షమించరాని నేరమని వన్నాల శ్రీరాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు గుర్తింపు కార్డులు చూసి హిందువులని నిర్ధారణ చేసుకొని మరీ కాల్పులు జరుపడం హిందూ సమాజంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. తన భర్తను చంపవద్దని ఒక మహిళ మొరపెట్టుకున్నా వదిలి పెట్టలేదని, పైగా మీ నరేంద్ర మోడీకి చెప్పుకోమని అంటూ నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారని వన్నాల ఆరోపించారు. ఈ నరమేధం జరిగిన వెనువెంటనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జమ్ము కాశ్మీర్ బయలుదేరి వెళ్లారని, సౌదీ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోది తన పర్యటనను రద్దు చేసుకొని హుటాహుటిన భారత దేశానికి తిరిగి వచ్చారని వన్నాల శ్రీరాములు తెలిపారు. ఈ దాడిలో ఏడుగురు ఉగ్రవాదులు పాల్గొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారని. వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని వన్నాల తేల్చి చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ ట్రంప్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారని, ఈ విషయంలో భారత దేశానికి మద్దతుగా నిలుస్తామని ప్రకటించడాన్ని వన్నాల శ్రీరాములు స్వాగతించారు.



## రాజనీతి శాస్త్ర విభాగంలో చల్లా స్వప్నకు డాక్టరేట్




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగంలో పరిశోధకురాలు చల్లా స్వప్నకు డాక్టరేట్ లభించింది. ఆసరా పథకం– గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలో దాని అమలు" అన్న అంశంపై చేసిన వివరణాత్మక పరిశోధనకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ తెలిపారు. కాకతీయ యూనివర్సిటీకి చెందిన రాజనీతి శాస్త్ర విభాగం ప్రొఫెసర్ వి.రామచంద్రం పర్యవేక్షణలో చల్లా స్వప్న పరిశోధన చేశారు. వరంగల్ నగరానికి చెందిన చల్లా స్వప్న తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, కళాశాలలో సివిక్స్ పీజీటీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ సాధించిన చల్లా స్వప్నకు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పరిశోధకులు, సహోద్యోగులు అభినందనలు తెలిపారు.

## పులిగిల్లలో బడిబాట కార్యక్రమం



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని పులిగిల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు, ఏపీసీ చైర్మన్ పబ్బ సరిత, విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదివేలా గ్రామస్తుల్లో అవగాహన పెంచడానికి కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేశారు. "మన ఊరి మన బడి – మనమే రక్షిద్దాం" అనే నినాదాలతో గ్రామమంతా తిప్పుతూ విద్యార్థుల చేర్పునకు ఈ చైతన్య యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్యాల సంపత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న వివిధ సౌకర్యాలను వివరించారు. ఉచిత మధ్యాహ్న భోజనం, వారానికి మూడు కోడిగుడ్లు, మూడు రోజుల రాగిజావ, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్లు, విలువలతో కూడిన సృజనాత్మక విద్య –ఇవన్నీ విద్యార్థుల సంపూర్ణాభివృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభను వెలికితీస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కటుకోజ్వల సతీష్, ఉమా, పద్మ, కవిత, ఆదిలక్ష్మి, ప్రదీప్, రాజేష్, నిరోషా మరియు అంగన్వాడీ టీచర్లు రాజేశ్వరి, హేమలత, సూర్యకళ, సూరమ్మ, సారమ్మ పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమాన్ని ఆదరించారు. బడిబాట అనంతరం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు, కరపత్రాలు పంపిణీ చేశారు. వేసవి కాలంలో పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్:** కాశ్మీర్ రాష్ట్రం, అనంతనాగ్ జిల్లా పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో ఉగ్రవాద సాయుధ దుండగులు పర్యాటకులపై కిరాతకంగా దాడి చేసి 28 మంది అమాయకులను హత్య చేయడం అత్యంత దురదృష్టకరమైన ఘటనగా పేర్కొన్నారు. భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు. ఈ దాడిలో ఇద్దరు విదేశీ పర్యాటకులు, హైదరాబాదులో నివాసం ఉంటున్న బీహార్‌కు చెందిన మనీష్ రంజన్ సహా వివిధ రాష్ట్రాల పౌరులు ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది గాయపడటం చాలా బాధాకరమన్నారు. పర్యాటకులపై ఉగ్రవాదులు చేయించిన ఈ పాశవిక దాడిని ప్రజాస్వామ్యవాదులు, దేశభక్తి గల పౌరులు సమర్ధించలేరని చెప్పారు. మరణించిన కుటుంబాలకు భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, క్షతగాత్రులకు సరైన వైద్యం అందించడంలో ప్రభుత్వం జాగ్రత్త వహించాలని వెంకట్రాములు సూచించారు.

## పహల్గాం ఘటన దుర్మార్గపు చర్య

**డాక్టర్ వన్నాల వెంకట రమణ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జమ్ము కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి చాలా బాధాకరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులు జరిపిన నరమేధానికి 27మంది మృతి చెందడమే కాక పదుల సంఖ్యలో పర్యాటకులు గాయపడ్డారని వన్నాల వెంకట రమణ ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు హిందువులను లక్ష్యంగా చేసుకుని సాధారణ పౌరులను పొట్టన పెట్టుకోవడం దుర్మార్గపు చర్య అని వన్నాల వెంకట రమణ దుయ్యబట్టారు. బైసరిన్ వ్యాలిని సందర్శించడానికి పర్యాటకులను టార్గెట్ చేసుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని వన్నాల వెంకట రమణ కోరారు. ఉగ్ర దాడిలో మరణించిన కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అల్లరిమూకలను మట్టుపెట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని వెంకట రమణ కోరారు. జమ్ము కాశ్మీర్ ప్రశాంత వాతావరణం నెలకొన్న తరుణంలో ఉగ్రవాదులు దాడులకు పాల్పడిన సంఘటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది వన్నాల వెంకట రమణ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఉగ్రదాడి పిరికి పంద చర్య

**వరంగల్ వాయిస్, వరంగల్:** ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో హిందువులపై దాడులు జరగడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) దీన్ని పిరికి పంద చర్యగా ఖండించింది. ఈ నేపథ్యంలో బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, వరంగల్ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్ వీర్ ఆదేశాలతో, స్థానిక వరంగల్ పోచమ్మ మైదాన్ కూడలిలో ఉగ్రవాదంపై నిరసనగా పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జనరల్ సెక్రటరీ సూరజ్ గౌడ్, రాపాక ప్రశాంత్, వినయ్, తరుణ్ పటేల్, వినయ్ పటేల్ తదితర యువమోర్చా కార్యకర్తలు, బీజేపీ కుటుంబ సభ్యులు, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, జనగామ:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన పిరికిపంద ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం జనగామ ఆర్టీసీ చౌరస్తా వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు ఆరుట్ల దశమంత రెడ్డి మాట్లాడుతూ – "పహల్గామ్ లో అమాయక పర్యాటకులు మరియు పౌరులపై జరిగిన ఈ అమానవీయ దాడి భారతదేశ సార్వభౌమత్వంపై జరిగిన దాడిగా పరిగణించాలి. ఈ దాడి దేశ భద్రతను, శాంతిని భంగం చేయాలనే ఉద్దేశంతో జరిగింది. ఇటువంటి ఘాతుక చర్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు," అని తెలిపారు. ఇలాంటి విపత్కర సమయంలో బాధితుల కుటుంబాలకు తాము అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల నారాయణతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాడిచెర్ల ఆధ్వర్యంలో మండలంలోని తాడిచెర్ల, పెద్దతూండ్ల, అడ్వాల పల్లి , దుబ్బపేట గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను బుధవారం పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కొనుగోలు కేంద్రాల ద్వారా కల్పిస్తుందని దీన్ని రైతులు వినియోగించుకోవాలని, ప్యాడి క్లీనర్స్ లేదా ఇతర పద్ధతుల ద్వారా తూర్పల చేసి, తేమ శాతం 17 వచ్చిన ధాన్యం కొనుగోలు చేయటం జరుగతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్క సూర్య ప్రకాష్ రావు, డైరెక్టర్స్ వొన్న తిరుపతిరావు, కొ అప్షన్ మెంబర్ మెరుగు రాజయ్య, తాజా మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో పిల్లలను గమనించాలి




**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలతో గడిపే సమయాన్ని సానుకూలంగా ఉపయోగించుకోవాలని, వారిని నిత్యం గమనిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడాలని కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ కుడికల సుభాష్ సూచించారు. కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి చివరిదినం సందర్భంగా తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంలో మాట్లాడిన జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ సుభాష్, వేసవి కాలంలో పిల్లలు మధ్యాహ్న సమయంలో బయట ఆడకూడదని, వేడిగాలికి గురై వడదెబ్బ తగిలే ప్రమాదం ఉండడంతో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే పిల్లలను ఖాళీగా ఉండనివ్వకుండా కథల పుస్తకాలు చదివించడం, కళలు నేర్పించడం, చిన్న చిన్న పనుల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం వంటి సృజనాత్మక కార్యాచరణలతో వారిని నిమగ్నం చేయాలని సూచించారు. అతిగా సెల్ ఫోన్ వాడకం వల్ల పిల్లల్లో శారీరక, మానసిక, సామాజిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున, తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు రాజకుమార్, రమేష్, రాజమౌళి, శ్రీనివాస్, పోగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రైతులకు సూచించారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంతో పాటు రవినగర్(జంగుపల్లి), గొల్లపల్లి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వంలో దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. ఇలాంటి అనేక హామీలను ఇచ్చి పదేళ్లు ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇంతకీ ఇరవై ఐదేళ్ల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా? తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా? అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభాస్థలి పరిశీలన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలసి శాయంపేట మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం వరంగల్ ఎల్కతుర్తి క్రాస్ రోడ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల రజతోత్సవ భారీ బహిరంగ సభ ఏర్పాట్లను, సభా ప్రాంగణాన్ని పరిశీలించి కార్యకర్తలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షులు మనోహర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు మేకల వెంకటేశ్వర్లు, దాసి శ్రావణ్ కుమార్, గాదె రాజేందర్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మేకల శ్రీనివాస్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నందం, మాజీ మండల అధ్యక్షులు ఘంట శ్యాంసుందర్ రెడ్డి, మాజీ కోఆప్షన్స్ సభ్యులు మొహిద్దిన్, మాజీ ఉపసర్పంచ్ అట్ల తిరుపతి, సీనియర్ నాయకులు కరుణ్ బాబు, అజయ్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




**వరంగల్ వాయిస్, తొర్రూరు:** దంతాలపల్లి మండలం దాట్ల ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు, ఫేర్వెల్ డే వేడుకలు ఉపాధ్యాయుడు స్థానిక చింతల సురేష్ ,మానస ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన దాట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్మవరపు కృష్ణయ్య మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే అనేది విద్యార్థులకు ఒక మరపురానీ జ్ఞాపకంగా ఉంటుందన్నారు. దాట్ల ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం అభినందనీయమని ఉపాధ్యాయుడు చింతల సురేష్ ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు అనిత, రవీందర్, కవిత, రత్నమాల, రామచంద్రు, అపర్ణ , తల్లిదండ్రులు ఉమా, లక్ష్మణ్ అంజయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

## పోప్ ఫ్రాన్సిస్ మరణం క్రిస్టియన్లకు తీరని లోటు



**వరంగల్ వాయిస్ , చెన్నారావుపేట :** రోమన్ దేశానికి చెందిన పోప్ ఫ్రాన్సిస్ మరణం క్రిస్టియన్ సోదరులకు తీరని లోటని తిమ్మరాయిని పహాడ్ పునీత రాయప్ప చర్చి ఫాదర్ తుమ్మ యాగారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మరాయిని పహాడ్ పునీత రాయప్ప చర్చిలో ఆయన ఆత్మకు విశ్రాంతి చేకూర్చాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ నాగోతు బాలజోజి, సిస్టర్ ఆరోగ్య శౌరీలు, అన్న మేరీ, రోజ్ లీన, సుజాత, గుడి పెద్దలు కొండవీటి ప్రదీప్ కుమార్, మల్లవరపు ఇన్నయ్య, గ్రామస్తులు రెడ్డి మాస్ ఫ్రాన్సిస్, నాగోతు సలోమోను, పుదోట అర్లయ, రెడ్డి మాస్ కిషోర్, మద్దినేని జాన్ క్రిస్టఫర్, కన్నెధార రాజీవ్, నాగోతు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పేరెంట్-టీచర్ సమావేశం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో మెగా పేరెంట్–టీచర్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు పాక శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో 40 మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. అనంతరం తల్లిదండ్రులు పాఠశాల సౌకర్యాలను అభినందించారు. ఉపాధ్యాయుల అంకితభావానికి కృతజ్ఞతలు తెలిపారు. అగ్రశ్రేణి విద్యార్థులకు మెమెంటోలు, వార్షిక ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు.

# వెంపటి సూర్యనారాయణ మృతి

## సంతాపం తెలిపిన వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఖమ్మం జిల్లాలో పేదల హక్కుల కోసం ఉద్యమించడంలో జీవితాన్ని అర్పించిన వ్యవసాయ కార్మికోద్యమ నేత, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేయంయూ) జాతీయ సమితి సభ్యుడు, అలాగే సుదీర్ఘకాలం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించిన కామ్రేడ్ వెంపటి సూర్యనారాయణ (103) బుధవారం అకస్మాత్తుగా కన్నుమూయడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బీకేయంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వెంపటి సూర్యనారాయణ ఖమ్మం జిల్లాలో భూమిలేని పేదల కోసం నిర్విరామంగా భూ పోరాటాలు నిర్వహించి, వేలాది ఎకరాలను పేదలకు దక్కేలా చేశారు. ఈ పోరాటాల నేపథ్యంలో అనేకసార్లు అరెస్టుకి గురై జైలు జీవితం గడిపారు. ఆయన చేసిన త్యాగాలు, పోరాటాలు మరువలేనివని వెంకట్రాములు పేర్కొన్నారు. సూర్యనారాయణ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసిన వెంకట్రాములు, వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. ఆయన పోరాటాల నుంచి నేటి యువతరం పాఠాలు నేర్చుకొని భూమి కోసం, భుక్తి కోసం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలన్నారు. అదే నిజమైన నివాళిగా నిలుస్తుందన్నారు.

## నేషనల్ సైన్స్ ఇన్స్పైర్ ప్రోగ్రాంకు ఎంపికైన సాయిచరణ్




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గలోని స్టాండర్డ్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి అడిగొప్పుల సాయిచరణ్ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ సైన్స్ ఇన్స్పైర్ ప్రోగ్రాం కు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల యాజమాన్యం ఆయనను ఘనంగా సత్కరించింది.సాయిచరణ్ కు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం తరపున రూ.10,000 నగదు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణ రాజు, ప్రముఖ సైకాలజిస్ట్ డా. కె.రమాదేవి, సాయిచరణ్ను శాలువాతో, శీల్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "సాయిచరణ్లో ఉన్నత స్థాయి ఆలోచనాశక్తి ఉంది. నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తితో ఉంటాడు. ఇన్స్పైర్లో అతనికి ఎంపిక కావడం తగిన గుర్తింపు," అని ప్రశంసించారు. డా. కె. రమాదేవి మాట్లాడుతూ, "ఇలాంటి విద్యార్థుల ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

## 25న భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

### రేగొండ తహసీల్దార్ కె.శ్వేత



**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన కొత్త రెవెన్యూ చట్టం ★భూభారతి (ROR–2025)★పై అవగాహన కల్పించేందుకు రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏప్రిల్ 25న ఉదయం 10:00 గంటలకు ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రేగొండ తహసీల్దార్ కె. శ్వేత ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ధరణి వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా కొత్తగా రూపొందించిన భూభారతి చట్టం విషయాలను రైతులకు వివరించి, అవగాహన పెంపొందించేందుకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సదస్సు ద్వారా గ్రామాలలోని రైతులకు చట్టంలోని ముఖ్య అంశాలను వివరించే ప్రయత్నం చేయనున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి రైతులు, యువకులు, రైతు నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ శ్వేత సూచించారు.

# ఘనంగా ప్రపంచ పుస్తకాల దినోత్సవం




**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రపంచ పుస్తకాల దినోత్సవం, ఆంగ్ల భాషా దినోత్సవం, టీ దినోత్సవం సందర్భంగా వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్లంబరులో గల జిల్లా గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, "పుస్తక పఠనం మనస్సును ఉత్తేజపరిచే ప్రక్రియ. ఇది ఆహ్లాదాన్ని కలిగించి విజ్ఞానాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. మనం చదివిన ప్రతి పుస్తకం మనకు మాత్రమే కాదు, సమాజానికి కూడా ఉపయోగపడే మార్గాన్ని చూపిస్తుంది" అని పేర్కొన్నారు. ఆంగ్ల భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఇలా తెలిపారు: "మాతృభాష అయిన తెలుగునే మొదటగా నేర్చుకోవాలి. అయితే ప్రస్తుత ప్రపంచంలో ఆంగ్ల భాషపై కూడా పట్టు అవసరం. ఇంట్లో పిల్లలకు తెలుగు భాష ప్రాధాన్యతను నేర్పించాలి" అని చెప్పారు. అలాగే టీ దినోత్సవం సందర్భంగా, "టీ తాగడం ద్వారా శరీరానికి విశ్రాంతి లభించడమే కాకుండా, మెదడు సక్రియంగా పనిచేయడానికి తోడ్పడుతుంది. చాలా మందికి పొద్దున్నే టీ తాగడం ఒక ఆనందకరమైన అలవాటు" అని వివరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ తో పాటు గ్రేడ్ వన్ లైబ్రేరియన్ ఎన్. శ్రీలత, ఆఫీస్ ఇంచార్జ్ చినబాబు, స్టాఫ్ సభ్యులు లక్ష్మి, రజిత పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పదవి అడ్డుపెట్టుకొని అరాచకాలు

● కౌశిక్ రెడ్డి తీరుపై కాంగ్రెస్ నేత ప్రణవ్ ఫైర్



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్, స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరుపై విమర్శలు గుప్పించారు. బుధవారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రణవ్ మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు, ప్రజల అవసరాల కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని, పదవిని దుర్వినియోగం చేసి వ్యాపారస్తులను బెదిరించడం అనైతికమని చెప్పారు. కమలాపూర్ మండలం వంగపల్లి–గుండేడ్ ప్రాంతంలో గ్రానైట్ వ్యాపారి కట్టా మనోజ్ రెడ్డిని బెదిరించి డబ్బులు వసూలు చేశాడని ఆరోపిస్తూ, బాధితుడి భార్య రమాదేవి సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన సభ్య సమాజానికి తలదించుకునేలా ఉందన్నారు. అలాగే, ఇదే కౌశిక్ రెడ్డి గతంలో కూడా పలువురిని బెదిరించాడని, హుజురాబాద్ ప్రజలు ఇప్పుడు తనను గెలిపించుకోవడాన్ని పశ్చాత్తాపంగా భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాదులో నీతిపాఠాలు చెబుతున్న కేటీఆర్, తమ పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న అరాచకాలకు సమాధానం చెప్పాలన్నారు. “కౌశిక్ రెడ్డి నిజంగా ధైర్యం ఉంటే రాజీనామా చేసి, ఉప ఎన్నికకు సిద్ధంగా ఉండాలి. అప్పుడు ఎవరు ప్రజల మద్దతు పొందుతారో తేలిపోతుంది” అని ప్రణవ్ సవాల్ విసిరారు. ఇప్పటి వరకు నియోజకవర్గానికి నిధులు తీసుకురాలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా కౌశిక్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యాడన్నారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు పత్తి కృష్ణారెడ్డి, కమలాపూర్ మార్కెట్ చైర్మన్ ఝూన్సీ–రవీందర్, హుజురాబాద్ మార్కెట్ చైర్మన్ రాజేశ్వరి–స్వామిరెడ్డి, మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు తలపట్టించారు.

## ఉగ్రదాడి బాధితులకు ప్రగాఢ సానుభూతి..

అలాగే, జమ్మూ కాశ్మీర్‌లోని పాహెల్గాం ఉగ్రదాడిలో మరణించిన 26 మంది కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దేశంలో ఉగ్రవాదాన్ని నియంత్రించేందుకు పార్టీలు వ్యత్యాసం లేకుండా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని, భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# భూ భారతితో భూములు భద్రం

• స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, జనగామ :** లింగాల ఘనపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో రైతుల కోసం నిర్వహించిన భూ భారతి–ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సు విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రారంభంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టానికి సంబంధించిన ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రైతుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, “ధరణి కంటే మెరుగైన చట్టమే భూ భారతి” అని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు అనేక మంది రైతులు గ్రామీణ ప్రాంతాల్లో సాదా బైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసి అనుభవంలోకి తీసుకున్నా, ధరణి ద్వారా వారికి భూముల క్రమబద్ధీకరణ జరగలేదని తెలిపారు. 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 మధ్య దాదాపు 10లక్షల మంది రైతులు దరఖాస్తు చేసినా పరిష్కారం లేకపోయిందని, భూ భారతి చట్టం ద్వారా వారికి న్యాయం జరగనుందని చెప్పారు. ఈ చట్టం ద్వారా రైతుల భూములకు సంబంధించి అన్ని రకాల సమస్యలకు పరిష్కారం లభించడమే కాకుండా, భూములకు భూధార్ కార్డులు కేటాయించనున్నట్లు





వెల్లడించారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ, రైతులకు భూమిపై హక్కులు కల్పించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రైతులు ఈ చట్టాన్ని పూర్తిగా అర్థం చేసుకుని ఉపయోగించుకోవాలని అధికారులంతా పిలుపునిచ్చారు. ఈ అవగాహన సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపిరామ్, తహసీల్దార్ రవీందర్ పాల్గొన్నారు.

## రఘునాథపల్లిలో..

భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ పాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో కలెక్టర్ రిజ్వాన్ పాషా, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంలోని అంశాలను కలెక్టర్ రైతులకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..... సర్వేనంబర్లలో బౌండరీల వల్ల వచ్చే సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో అదరపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్డీవో గోపిరామ్ నాయక్, తహసీల్దార్ మోసిన్ మూజ్జాభా, జిల్లా గ్రంధాలయ చైర్మన్ మారిజోడు రాంబాబు, ఎంపీడీవో శ్రీనివాసులు,ఏవో శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దిష్ట తేమ శాతం రాగానే ధాన్యం కొనుగోలు జరగాలి



➲ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ:** లింగాల ఘనపూర్ మండలం లోని నెల్లుట్ల ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని కలెక్టర్ పరిశీలించిసంబంధిత ధాన్యం కొనుగోళ్ల రిజిస్టర్ లను తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు కళ్లాల్లోని ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈదురు గాలికి ధాన్యం ఎగిరిపోకుండా టార్పాలిన్లను పకడ్బందీగా ధాన్యం కుప్పలపై కప్పాలని సూచించారు. నిర్దిష్ట తేమ శాతం రాగానే కొనుగోళ్లు పూర్తిచేసి, ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని...కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందాలని తెలిపారు. అలాగే సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని.. కొనుగోలు వివరాలు ఓపీఎంఎస్ లో వెంటనే నమోదు చేయాలని కేంద్ర నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో ఆర్డీఓ గోపీరామ్ , మండల తహసీల్దార్ రవీందర్, ఐకేపీ నిర్వాహకులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రణవ్



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** పట్టణ కేంద్రంలోని ఎంపీఆర్ గార్డెన్స్ లో మర్రి రాజి రెడ్డి–వాసవి రెడ్డి వివాహానికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక కాంగ్రెస్ నేతలు, నాయకులు పాల్గొన్నారు.

# విజేత పిల్లల ఆసుపత్రి ప్రారంభం



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** పట్టణంలో నూతనంగా నిర్మించిన విజేత పిల్లల ఆసుపత్రిని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ప్రారంభించారు.

# ప్రమాదాలకు కారణమయ్యే నిర్మాణాలు

## డిపో మేనేజర్‌పై సీనియర్ సిటిజన్ ఆగ్రహం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రవేశద్వారంలో మిల్క్ పార్లర్ నిర్మాణం ప్రణాళిక లేకుండా, ఆర్టీసీ అధికారుల సొంత నిర్ణయంతో జరుగుతుండడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ నిర్మాణం భవిష్యత్తులో ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పరకాల సీనియర్ సిటిజన్ మార్త భిక్షపతి హెచ్చరించారు. ఆర్టీసీ పరిపూర్ణ ప్రణాళిక లేకుండానే ఈ పనులు చేపడుతుండటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మిల్క్ పార్లర్‌ను బస్టాండ్ లోపల ఏర్పాటు చేయాలని కోరుతూ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లినప్పుడు, మేనేజర్ అది స్వీకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆరోపించారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన భిక్షపతి, భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు పూర్తి బాధ్యత ప్రస్తుత డిపో మేనేజర్‌దేనని స్పష్టం చేశారు. డిపో మేనేజర్ నిర్లక్ష్యంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా, డిపో మేనేజర్‌పై త్వరలో అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వినతిపత్రం తీసుకోకపోవడంతో నిరసనగా పరకాల బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సుకు వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు.

# పహల్గహమ్ ఉగ్ర దాడి హేయమైన చర్య

## మాజీ సైనికుడు రమేష్ యాదవ్




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** జమ్మూ కశ్మీర్ లో జరిగిన ఉగ్రవాద దాడిని మాజీ సైనికుడు నన్నెబొయిన రమేష్ యాదవ్ ఖండించారు. ఈ ఘటనను హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి చర్య భారత ప్రజల సమైక్యతను దెబ్బ తీయలేవని ఆయన అన్నారు.ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాద సంస్థల పైన కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ సైనికుడు రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

# గ్రావిటీ విద్యార్థుల విజయఢంకా

## ఇంటర్ ఫలితాల్లో ఘన విజయం




**హనుమకొండ, వరంగల్ వాయిస్:** రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నిన్న విడుదల చేసిన ఫలితాల్లో గ్రావిటీ జూనియర్ కాలేజ్, హనుమకొండ విద్యార్థులు విజయడంక మోగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విజయాలు కళాశాల స్థాయిలో ప్రశంసలందుకున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో మొత్తం 470 మార్కుల్లో, కె. అభినాష్ 467 మార్కులు సాధించగా, కె. అమూల్య, డి. రోహిణి, జి. చైతన్యలూ తలసరిగా 466 మార్కులు పొందారు. అలాగే 460కి పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 30కి చేరింది. బైపీసీ విభాగంలో 440 మార్కుల్లో కె. శ్రవ్య 436 మార్కులు సాధించగా, ఆర్. వైష్ణవి, ఈ. భార్గవ సాయి లు 430 మార్కులకిపైగా పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగం: 1000 మార్కుల్లో ఓ. కీర్తన 995 మార్కులు, సీహెచ్. సౌమ్యశ్రీ 992 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో జి.రాజేష్ నాయక్ 992 మార్కులతో టాప్ ర్యాంక్ సాధించాడు. ఈ ఘనత సందర్భంగా కళాశాల చైర్మన్ మహేష్, ప్రిన్సిపాల్ నరసింహారావు విద్యార్థులను అభినందించారు.డైరెక్టర్లు సందీప్, అమరేందర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, శ్రీకాంత్, వంశీకృష్ణతో పాటు అధ్యాపకులు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ఉర్సుగుట్ట ఎంజేపీ ప్రభంజనం





**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా ఉర్సుగట్టులోని మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభను కనబర్చారు. ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో బాలికలు అధిక మార్కులతో దూసుకుపోయారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో జి. నవజ్యోతి మరియు కె. జాష్నిత ఇద్దరూ 991/1000 మార్కులతో టాపర్లుగా నిలిచారు. అలాగే జి. షైనిష్ణా, కె. చందన, కె. హారిక తలసమానంగా 988 మార్కులు, ఏ. శ్రావణి 986 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఎస్. ప్రీతి, ఎం. వైష్ణవి 985 మార్కులు, కనుకుల ఐశ్వర్య 978, పిట్ట అశ్రిత 977 మార్కులు పొందారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో బి. రచన, జి. పూజిత, ఎం.అక్షిత, పి.పూజిత, వి.నందిని ఒక్కోరు 466/470 మార్కులు సాధించారు. బి. హాసిని, జి. రాజేశ్వరి, కె. రీక్షిక 465, ఏ. రిషిత, ఎ. ప్రసన్న, జి. నందిని ఒక్కోరు 464 మార్కులు పొందారు. బైపీసీ విభాగంలో కె. నవ్య 437/440, టి. గ్రీష్మశ్రీ 435, కె. అభివర్షిత 433, చందన 432, కె. అక్షయ 432 మార్కులతో మెరిశారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి అభినందనలు తెలియజేశారు.

# పద్మశాలి బిడ్డ మార్గం హరిప్రియకు ఉత్తమ ర్యాంకు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాకు చెందిన మార్గం శ్రీనివాస్, ఉమారాణి దంపతుల పెద్ద కుమార్తె మార్గం హరిప్రియ ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ (ఎం.పి.సి) లో 468/470 మార్కులతో అద్భుత ప్రతిభను కనబరిచి రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ స్థానం సంపాదించింది. హైదరాబాద్‌లోని డీఆర్ జూనియర్ కాలేజ్‌లో విద్యనభ్యసిస్తున్న హరిప్రియ తన అసాధారణ విజయంతో విద్యారంగంలో ప్రభంజనం సృష్టించింది. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, తెలంగాణ సైజ్ కాంట్రాక్టర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ మెతుకు ఉప్పలయ్య, విజయలక్ష్మి సాయికిరణ్, కట్ట సౌమ్య సాయిచరణ్ తదితరులు హరిప్రియను అభినందించారు. ఆమె విజయానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజేతలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# ఇంటర్ ఫలితాలలో షైన్ ప్రభంజనం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో ఎంపీసీ, బైపీసీలో స్టేట్ ర్యాంకులు సాధించి కార్పోరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలను అందజేయడం జరిగిందని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగుల రమ, పి.రాజేంద్రకుమార్, షైన్ రెసిడెన్షియల్ స్కూల్ క్యాంపస్ డైరెక్టర్ జె. శ్రీనివాస్, ఐఐటి కో–ఆర్డినేటర్ మూగుల రమేష్ యాదవ్లు సంయుక్తంగా తెలియజేశారు. మంగళవారం విడుదల చేసిన ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో షైన్ జూనియర్ కాలేజి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. షైన్ విద్యాసంస్థలు మొదటి నుంచి ఇంటర్మీడియట్ విద్యలో అత్యుత్తమమైనటువంటి శిక్షణను వరంగల్ లో అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఎం.దీక్షిత –468, కె.యశస్విని కుమారి –467, కె. నిశాంత్– 467, 11మంది విద్యార్థులకు 466, 23మంది విద్యార్థులకు 465 మార్కులు, బైపీసీ మొదటి సంవత్సరంలో అకిబ్ అలీ–437, సీహెచ్ కీర్తన –436, సీహెచ్ అజిత్ రెడ్డి–435, ఎండీ సాదుద్దీన్ – 435,ఇంటర్ రెండో సంవత్సరం ఎంపీసీలో డీ. అనువర్షిణి –992, జి.వికాస్ –991, భార్గవి వీరారెడ్డి –991, ఎం.వరుణ్ సందేశ్



–991, ఎం.రక్షిత –990, బైపీసీలో డి.ఇందు–991, కె సహస్ర 991, వెంకటశివాణి –989, ఎం.రమ్య –989, టీ హాసిని –987 సాధించిన విద్యార్థులను అభినందించారు. వీరితో పాటుగా రెండవ సంవత్సరంలో ఎంపీసీలో 970 మార్కులకు పైగా 66 మంది విద్యార్థులు, బైపీసీలో 960కి పైగా 31 మంది విద్యార్థులు అలాగే మొదటి సంవత్సరం ఎంపీసీలో 460కి పైగా మార్కులు 67 మందికి బైపీసీలో 10 మంది విద్యార్థులు 430కి పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల డైరెక్టర్ ఐఐటీ కో–ఆర్డినేటర్ రమేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపల్స్ మారబోయిన రాజు గౌడ్, కె. శ్రీనివాసన్, సంధ్య, ప్రశాంత్, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన రెజోనెన్స్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో రెజోనెన్స్ జూనియర్ కాలేజీలు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి తమ ప్రతిభను మరొకసారి నిరూపించుకున్నాయి. ఎంపీసీ, బైపీసీ విభాగాలలో రెజోనెన్స్ విద్యార్థులు మొత్తం 90 రాష్ట్ర స్థాయి ర్యాంకులు దక్కించుకున్నారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో భూక్యా మనోజ్ కుమార్, వేముల అనిక్షిత, గందే వర్ష, మంతిని సహస్ర 468/470 మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించారు. మరో 22 మంది విద్యార్థులు 467/470 మార్కులతో రాష్ట్ర ద్వితీయ ర్యాంకు, 21 మంది తృతీయ ర్యాంకు, 25 మంది నాల్గవ ర్యాంకు సాధించడం విశేషం. బైపీసీ విభాగంలో గంద్ర శ్రీజ 438/440,చాపర్తి శ్రీనిధి, దర్శుల శ్రీతిక ఇద్దరూ 436/440 మార్కులతో ర్యాంకులు సాధించారు. ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో నీలం నిక్షిత 995/1000, బుర్ర అక్షిత 994/1000 మార్కులు సాధించి టాప్ ర్యాంకుల్లో నిలిచారు. బైపీసీ విభాగంలో యం. పూజశ్రీ, ఆర్. ఇక్షవర్, డి. త్రిలోచన్, యం. అస్మిత అనే విద్యార్థులు ఒక్కొక్కరూ 992/1000 మార్కులు సాధించారు. ఈ గొప్ప విజయాన్ని పురస్కరించుకుని, రెజోనెన్స్ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల తోడ్పాటు, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అభినందన కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఏవో లెక్కల రమ్య, అకడమిక్ డీన్ బి.యస్. గోపాలరావు, డీన్ కె. సాంబశివుడు, కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఇంటర్ ఫలితాల్లో గౌతమ్ జూనియర్ కాలేజీ ప్రభంజనం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఇంటర్మీడియట్ 2025 ఫలితాలలో గౌతమ్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగింది. సెకండ్ ఇయర్ ఎంపీసీలో ఆడెపు సౌమ్య 993/1000, సెకండ్ ఇయర్ బైపీసీ పూజారి శరణ్య 993/1000, నాగపూరి హాసిని 990/1000, కందుల అభినయ 990/1000 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో గజనవేణి సంజన 466/470, బండారి కావ్య 466/470, గజెల్లీ వైష్ణవి 466, బింగి శ్రావణి 466, వంగల శ్రావణి 465, ఫస్ట్ ఇయర్ బైపీసీలో సామల రుషిత 434/440, జూనియర్ సీఈసీలో తోడేటి శ్రీయుత్ 462/500 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు అభినదించారు. ఇంతటి ఘనవిజయానికి కారకులైన మా బోధన మా బోధనేతర సిబ్బందికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు, మా శ్రేయోభిలాషులకు గౌతమ్ కాలేజీ డైరెక్టర్స్ అంభీర శ్రీకాంత్, మంతెన భిక్షపతి, గొట్టె లక్ష్మణ్, బండి పరుశరామ్, అరెల్లి ధనుంజయ్, సందరాజు, సంతోష్ లు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విజయభేరి

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోపాలపురంలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "ఓరుగల్లు వంటి చారిత్రాత్మక నగరంలోని విద్యార్థులు ఇకపై హైదరాబాదు, విజయవాడ, గుంటూరులోని కార్పొరేట్ కాలేజీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వారి స్వస్థలంలోనే అత్యుత్తమ నాణ్యత కలిగిన ఫిజికల్ క్లాసులు అందించాలనే లక్ష్యంతో హనుమకొండ, వరంగల్‌లో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలను స్థాపించామని తెలిపారు. ఇందులో భాగంగా, ఆల్ఫోర్స్ విద్యార్థులు IIT, NEET వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి తమ ప్రతిభను చాటుతున్నారు. ఇటీవల ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఇంటర్ మొదటి మరియు రెండవ సంవత్సర ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు చారిత్రాత్మక విజయాలు సాధించారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో జె.అంజనా (బైపీసీ విభాగం)లో 997 మార్కులతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంపీసీ విభాగంలో కె. రుత్విక్ 996 మార్కులు, ఎస్. సేవితా, టి. కీర్తన, ఎస్. కీర్తన 994, జి. వర్షిణి 993, టి. సాత్విక, హెచ్. పల్లవి, డి.గాయత్రి, కె. హాసిని 992 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో గరిష్టంగా 470 మార్కులకు గాను జి.తరుణ్ మరియు ఎ.నిచిత 468, కె. సహస్ర, వి. శ్రీ వర్షిణి, పి.సిరిచందన, ఎస్.దేషిమి, కె. వర్షి, పి. సాత్విక, కె. శ్రీశాంత్, పి.బన్ని, కె.గీతాం నిహారి, వి. హాసిని 467 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో సభిలా తారీమ్, సామాఫి రథోస్–438,యు. హాసిని–437, సీహెచ్. మనస్విని–436 మార్కులు సాధించారు.

# కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సుహాస్



టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఎంట్రీ ఇచ్చి అనతి కాలంలోనే బాగానే గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో తొలిసారిగా 'కలర్ ఫోటో' మూవీతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. మొదటి చిత్రంతోనే నటన పరంగా తెలుగు ప్రేక్షకులను కట్టిపడేశాడు. అలా వరుస అవకాశాలు అందుకుంటూ, సుహాస్ నటించిన చాలా సినిమాలు కూడా మంచి సక్సెస్ గా నిలిచాయి. దీంతో దర్శక నిర్మాతలు కూడా సుహాస్ తో సినిమాలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. తాజాగా హీరో సుహాస్‌కి సంబంధించిన ఒక వార్త వైరల్ గా మారింది. అదేమిటంటే కోలీవుడ్ నటుడు సూరి హీరోగా 'మండాడి' మూవీలో నటిస్తున్నాడు. ఇంతకు ముందు పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఎల్‌రెడ్ కుమార్ తన ఆర్‌ఎస్ ఇన్ఫోటెయిన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తుండగా, ఆయన శిష్యుడు, మణి మారన్ పుగళేంది కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నటి మహిమా నంబియార్ కథనాయికగా నటిస్తోంది. అయితే ఈ చిత్రం ద్వారా సుహాస్ కోలీవుడ్ కు పరిచయం అవుతున్నారట. ఈ మూవీలో సుహాస్ చాలా ముఖ్యమైన పాత్రలో నటించబోతున్నాడు. కాగా త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. దీంతో తాజాగా ప్రోమోను కూడా విడుదల చేశారు.

# కాశ్మీర్ నరమేథంపై చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి







దాడిని ఖండిస్తూ నటీనటుల పోస్ట్

పహల్గాం లో మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది క్షమించరాని క్రూరమైన చర్య అని చిరంజీవి అన్నారు. బాధితులను చూస్తుంటే తన హృదయం బరువెక్కుతోందని ఎన్టీఆర్ తెలిపారు. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేక పోతున్నానంటూ జాన్వీకపూర్ ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి తెలియజేస్తూ అల్లు అర్జున్ పోస్ట్ పెట్టారు. జమ్మూకశ్మీర్‌లోని ప్రకృతి అందాలను చూసి పరవశిస్తోన్న వారిపై పాశవికంగా దాడి చేసి 28 మందిని పొట్టన పెట్టకున్నారు. ఈ పెనువిషాదంపై సినీప్రముఖులు స్పందిస్తున్నారు. దాడిని ఖండిస్తూ మృతులకు సంతాపం తెలుపుతున్నారు. దీనిపై వీడియో చేస్తూ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కన్నీరు పెట్టుకున్నారు. ఇది మాటలకు అందని విషాదమన్నారు. ఇది క్షమించరాని చర్య అని చిరంజీవి పోస్ట్ పెట్టారు. 28 మంది అమాయకులను బలిగొన్న దారుణమైన ఈ దాడి హృదయ విదారకమైనది. ఇది క్షమించరాని క్రూరమైన చర్య. మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. వారి నష్టం తీర్చలేనిదని చిరంజీవి అన్నారు. బాధితులను చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. శాంతి కోసం ప్రార్థిస్తున్నా అని ఎన్టీఆర్ అన్నారు.

ఇది క్షమించరాని చర్య. ఈ ఉగ్ర చర్యపై అందరూ మౌనం వీడండి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. వారికి తగినవిధంగా బుద్ధి చెప్పాలని సంజయ్‌దత్ అన్నారు. ఈ దాడి భయంకరమైనది. అమాయకులను చంపడం చాలా దారుణం. మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నానని అక్షయ్ కుమార్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి గురించి తెలిసి దిగ్భ్రాంతి చెందాను. నా హృదయం బరువెక్కింది. సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం అన్యాయం. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేకపోతున్నా. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా. మేమంతా మీ వెంట ఉన్నాం. ఈ బాధ నుంచి కోలుకునే ధైర్యాన్నివ్వాలని దేవుడిని వేడుకుంటున్నాని జాన్వీ కపూర్ పేర్కొన్నారు. నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదు. ఈ దుర్మార్గపు చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని సోనూసూద్ తెలిపారు. పహల్గాం ఎంతో అందమైన ప్రదేశం. అక్కడ జరిగిన ఈ దాడి గురించి తెలిసి నా గుండె పగిలిపోయింది. బాధిత కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. మృతి చెందిన అమాయకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అల్లు అర్జున్ తెలిపారు.



### కాశ్మీర్ దుర్ఘటనపై విజయ్ ఆవేదన



పహల్గాంలో మంగళవారం ప్రకృతి అందాలను చూస్తోన్న పర్యటకులపై ఉగ్రవాదులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిని సినీ సెలబ్రిటీలు ఖండిస్తున్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన ఆ ప్రాంతంతో తన అనుబంధాన్ని హీరో విజయ్ దేవరకొండ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఈ దాడి ఘటన తన మనసును కలిచివేస్తోందంటూ పోస్ట్ పెట్టారు. రెండేళ్ల క్రితమే తన పుట్టినరోజును పహల్గాంలో సెలబ్రేట్ చేసుకున్నాడు. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన నేను.. కశ్మీర్‌లోని అందమైన ప్రాంతంలో అక్కడి ప్రజల స్వచ్ఛమైన నవ్వుల మధ్య నా పుట్టినరోజు చేసుకున్నాను. ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం సిగ్గుచేటు–. ఇలాంటి పిరికి వాళ్లను త్వరలోనే అంతమొందిస్తారని ఆశిస్తున్నా. భారతదేశం ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు. బాధిత కుటుంబాలకు మేం అండగా నిలుస్తాం అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# క్రిష్ ఘాటిని కూడా వదిలేశాడా?



టాలీవుడ్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి టాలెంట్ గురించి మనకు తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ఏ మూవీ అయిన ప్రేక్షకుల మదిలో అలా నిలిచిపోతాయి. ఏ దర్శకుడు టచ్ చేయని కాన్సెప్టులతో క్రిష్ పలు సినిమాలు తెరకెక్కించాడు. కానీ ప్రస్తుతం క్రిష్ –టైమింగ్ బాలేదు. ముందుగా పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో 'హరిహర వీరమల్లు' చిత్రం తెరకెక్కించగా,ఈ మూవీతో క్రిష్ జాతకం మారిపోవడం ఖాయం అని అనుకున్నారు. 9 నెలల్లో ఈ ప్రాజెక్ట్ ని పూర్తి చేద్దామని స్పీడ్ మీద ఉన్న క్రిష్.. ఫస్ట్ హాఫ్ ని చాలా తొందరగా పూర్తి చేశారు. కానీ మధ్యలో కరోనా, లాక్ డౌన్ అంటూ గ్యాప్ వచ్చింది. ఇక అంత క్లియర్ అయిన టైంలో క్రిష్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నాడు.. ఇక ఈ మూవీ నుండి తప్పుకున్న తర్వాత అనుష్కతో 'ఘాటి' మొదలు పెట్టాడు. గత ఏడాది టీజర్ కూడా విడుదల చేసి మూవీపై భారీ అంచనాలు పెంచాడు. అయితే ఈ చిత్రాని ఏప్రిల్ 18న రిలీజ్ చేయబోతున్నట్టు మేకర్స్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఈ సినిమా పరిస్థితి అయోమయంగా మారింది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేస్తారనే దానిపై క్లారిటీ కూడా లేకుండా పోయింది. అంతే కాదు ప్రేక్షకుల్లో కొత్త అనుమానాలు మొదలయ్యాయి. ఈ మూవీ కూడా మధ్యలో ఆగిపోయిందా?, లేకపోతే క్రిష్ ఈ చిత్రం నుంచి తప్పుకున్నాడా? అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇంతకు ముందు కూడా బాలీవుడ్ లో ఆయన 'మణికర్ణిక' వంటి చిత్రాన్ని మొదలు పెట్టి, మధ్యలో వెళ్ళిపోయాడు. మిగిలిన సినిమా కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. 'హరిహర వీరమల్లు'ని మధ్యలోనే వదిలిపెట్టేశారు. ఇక ఇప్పుడు ఘాటీని కూడా మధ్యలోనే వదిలేశారా అన్న ప్రశ్న తలెత్తుతుంది.

### హరిహరవీరమల్లు కోసం పవన్ డేట్స్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రజంట్ ఇటు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే.. ఒప్పుకున్న సినిమాలను ఒక్కొక్కటిగా పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నాడు. 'హరిహర వీరమల్లు' కోసం పవన్ కాల్ షీట్స్ కేటాయించాడట. మేలో ఇంకొన్ని రోజుల్లోనే పవన్ షూట్‌కు హాజరు కానున్నాడట. ఆయనో పది రోజులు వరుసగా చిత్రీకరణకు వస్తే బ్యాలెన్స్ షూట్ అంతా అయిపోతుంది. మాట అయితే ఇచ్చాడు కానీ పవన్ వచ్చే వరకు ఏదీ గ్యారెంటీ– లేదు కాబట్టి కొత్త రిలీజ్ డేట్ ప్రకటించడం లాంటిదేమీ చేయట్లేదు చిత్ర బృందం. ఇక ఈ సినిమాలో అందాల భామ నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోండగా బాబీ డియోల్, నోరా ఫతేహి ఇతర ముఖ్య పాత్రపోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఏఎం.రత్నం ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, ఏప్రిల్ 23, 2025



# కాంగ్రెస్ అరాచకాలను ఎండగడతాం..

- బీజేపీ తెలంగాణకు అన్యాయం చేస్తోంది
- కేసీఆర్ ప్రసంగం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** గత 16నెలలుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చేస్తున్న అరాచకాలను బహిరంగ సభ వేదికగా ఎండగడతామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లను ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులతో కలిసి బుధవారం కేటీఆర్ పరిశీలించారు. వివిధ ప్రాంతాలనుంచి సభకు భారీ సంఖ్యలో విచ్చేయనున్న నేపథ్యంలో అందుకు ఏమాత్రం తగ్గకుండా ఏర్పాట్లు భారీగా ఉండాలని సూచించారు. మ్యాప్ ద్వారా సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రజతోత్సవ సభలో చేయనున్న ప్రసంగం కోసం దేశవ్యాప్తంగా ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. అదే విధంగా కేసీఆర్ ప్రసంగాన్ని గ్రామ స్థాయిలోకి చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉంటుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ తెలంగాణకు అన్యాయం చేస్తోందని, గత 11 ఏళ్లుగా రాష్ట్రానికి సహకరించడంలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పెద్దలు చేస్తున్న అరాచకాలను సభా వేధికగా ఎండగతామన్నారు. సభ సక్సెస్ చేసేందుకు ఇప్పటికే గ్రామాలు, మండలాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించినట్లు ప్రకటించారు. అదే విధంగా సభకు వచ్చే వారికి ఎలాంటి ఆటంకాలు కలుగకుండా చూసుకోవల్సిన బాధ్యత ఇక్కడి నాయకులపై ఉందన్నారు. వాహనాల పార్కింగ్, తాగునీ వసతి, మజ్జిగ ప్యాకెట్లు సభను వీక్షించడానికి కావలసిన ఎల్ఈడీ స్క్రీన్స్, విద్యుత్ లైట్లు అన్ని రకాల సౌకర్యాలతో సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కలపల్లి రవీందర్, దాస్యం వినయ భాస్కర్, మధుసూదనా చారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సతీష్ బాబు, వద్దిరాజు రవిచంద్ర, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, బండా ప్రకాశ్, గండ్ర వెంకటరమణా రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, బానోత్ శంకర్ నాయక్, నన్నపునేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీకారం తీర్చుకుంటాం

- హిందువులపై మారణకాండను సహించం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- పహల్గాం దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి దేశ హృదయాన్ని కలిచివేసిందని, మానవత్వం లేని మృగాలు చేసిన ఒక పిరికిపందల చర్య అని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. ఈ దాడులను ఖండిస్తూ బుధవారం రాత్రి వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి పాపయ్యపేట చమన్ వరకు మౌనంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ముష్కరుల అమానుష దాడిలో 27 మంది అమాయక హిందువులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం దురదృష్టకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద ఘటనను తీవ్రంగా ఖండించారు. మోదీ సర్కార్ ఎప్పటికీ కవ్వింపు చర్యలను సహించదన్నారు. ఇంతకింత ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. దేశంలోని కొంతమంది ముస్లింలు కూడా ఈ దాడుల విషయంలో మౌనంగా ఉండడం సరైనది కాదన్నారు. సేవ్ పాలస్తీన అన్న మేధావులు ఈరోజు మౌనంగా ఉండటంతో వారు అంతర్గత ఉగ్రవాదులుగా మారారన్నారు. అలంటి వాళ్ళను కూడా గుర్తించి, వాళ్లకు బుద్ధి చెప్పి తీరుతమన్నారు.






## నక్కలగుట్టలో శాంతి ర్యాలీ..

అమాయకపు పర్యాటకులపై ముష్కరముగల దాడి అవివేకమని, ఇలాంటి చర్యలను ప్రపంచ శాంతిని కోరుకునే వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు తీవ్రంగా ఖండిస్తున్నారని సంస్థ ఫౌండర్ మహమ్మద్ సిరాజుద్దీన్ అన్నారు. బుధవారం నక్కలగుట్ట ప్రాంతంలో శాంతి ర్యాలీ నిర్వహించి కాళోజి విగ్రహం వద్ద మృతుల ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, ఆచార్య విజయబాబు, శనిగరకు రాజమోహన్, ఆచార్య రవి, సరళ, గంటా రామిరెడ్డి, రామనరసింహస్వామి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.




# గంజాయిపై ఉక్కుపాదం

## నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు

**వరంగల్ వాయిస్, క్రైం :** మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు నార్కోటిక్స్ బ్యూరో కఠిన చర్యలు తీసుకుంటుందని నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలను నిరోధించడం ప్రతీ పౌరుడి బాధ్యత అన్నారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆదేశాల మేరకు, ఎస్పీ రూపేష్ పర్యవేక్షణలో బుధవారం నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ లో డీఎస్పీ సైదులు హనుమకొండ, వరంగల్ పట్టణ పరిధిలోని జిమ్ ఓనర్స్, కోచ్‌లతో అవగాహన సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగంతోపాటు సింథటిక్ ఇంజెక్షన్స్, స్టెరాయిడ్స్ ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సదస్సులో జిమ్‌లో రికార్డుల నిర్వహణతోపాటు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కొనుగోలు, అమ్మకం, రవాణా, వాడకంతో వచ్చే దుష్పరిణామాలపై వివరించారు. జిమ్ లో సీసీ కెమెరాలతో పాటు కస్టమర్ల ఫోన్ నంబర్లు, ఆధార్ కార్డుల సేకరణ చేయాలన్నారు. ఎవరికైనా గంజాయి, డ్రగ్స్ కి సంభందించిన అమ్మకాలు, కొనుగోలు, తాగే వివరాలు తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908, టీజీఏఎన్బీ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712671111 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నార్కోటిక్ ఇన్స్పెక్టర్ బి.రవిందర్, మట్టేవాడ ఇన్స్పెక్టర్ గోపి, నార్కోటిక్ ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభ దాత కల్వచర్ల వంశీకృష్ణతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ధ్వజస్తంభాన్ని గోవిందరాజుల గుట్ట పైకి తీసుకు వెళ్లడానికి కష్టనష్టాలను, ఎండ తీవ్రతను, కూడా లెక్కచేయకుండా స్థానికులు, భక్తులు, అర్చకులు తమ వంతు సహాయ సహకారాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వేణు మాధవస్వామి, వేణుస్వామి, శ్రీకాంత్ స్వామి, కిరణ్ స్వామి, అరుణ్ స్వామి, మనోహర్, భాషాపక సదానందం, కొమ్ము రాజకుమార్, యాటా సత్యనారాయణ, యాట ప్రతాప్, సిరబోయిన మహేశ్, సాగర్, ధనలక్ష్మి, అరుణ, పద్మ, శ్రీను, రాధాకృష్ణ, పురజానులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com